క్లుప్తంగా

సర్కార్ విద్యకు ప్రాధాన్యం



నోట్‌బుక్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): సర్కార్ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వం పాఠశాలలకు మంజూరైన నోట్‌బుక్‌లను మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఇంటర్ కళాశాలలకు 35,260 నోట్‌బుక్‌లు వచ్చాయని తెలిపారు. మంజూరైన నోట్‌బుక్‌లను విద్యార్థులకు అందజేయాలని ప్రధానోపాధ్యాయులకు, అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,సీఆర్పీలు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

సంగారెడ్డి టౌన్: గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను ఒత్తిళ్లకు గురిచేస్తూ విధులకు అడ్డుపడుతున్న సూపరింటెండెంట్ ఆంజనేయులును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల నాయకులు ఆర్‌సీఓ భూమయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ సోషల్ ఫోరం రాష్ట్ర నాయకులు వేణుగోపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా గురుకులాల్లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు డబ్బులు తీసుకుంటూ తనకు తెలిసినవారికి కట్టబెడుతున్నారని ఆరోపించారు. దీంతో వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సూపరింటెండెంట్ ఆంజనేయులును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు కలకుంట్ల అనిల్, ప్రవీణ్, ఎండీ ఖాజ, గురుకుల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర నాయకులు పండు, అంబేడ్కర్ సంఘం పటాన్‌చెరు బహుజన నాయకుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: గ్రామ పంచాయతీల కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్మికులతో కలిసి మంగళవారం నారాయణఖేడ్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ జీపీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించడంతో పాటు జీఓ 51ను వెంటనే రద్దు చేయాలన్నారు. 13 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, రాములు, పోచయ్య, సత్తమ్మ పాల్గొన్నారు.

నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

నారాయణఖేడ్: మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించిన నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర సేవలు అవసరమైన వారు 9949309592, 9440881271 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్షయవ్యాధి శిబిరం ఏర్పాటు



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్యురాలు రాధిక ఆధ్వర్యంలో క్షయ వ్యాధి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 150 మందికి వైద్య పరీక్షలు చేయగా 10 మందికి క్షయవ్యాధి నిర్ధారణ అయినట్టు వైద్యురాలు రాధిక తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్‌పై దుష్ప్రచారం తగదు

ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



రాయికోడ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

రాయికోడ్(అందోల్): ఉచిత విద్యుత్ సరఫరాపై దుష్ప్రచారం తగదని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మంగళవారం రాయికోడ్, సింగితం గ్రామ రైతులతో పాటు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల ఉచిత విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎండగట్టాలన్నారు. వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, అందులో భాగంగానే రైతుల సంక్షేమం కోసం రైతుబీమా, రైతుబంధు, 24గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రవేశపెట్టి రైతాంగానికి అండగా నిలుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, ఆత్మ, వరము సంఘాల నాయకులు విఠల్, తుకారామ్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సిద్దప్పపాటిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజ్ పాటిల్, శంకర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ మారుతి, బీఆర్ఎస్ నాయకులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మండల పరిధిలోని సిరూర్ గ్రామానికి చెందిన మల్లమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.52వేల చెక్కును మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం చేయించుకోలేని నిరుపేదలు సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి నాజీంపటేల్, నాయకులు ఇస్మాయిల్‌పటేల్, అంజన్న, అశోక్, కృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జహీరాబాద్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన పీపడ్‌పల్లి మాజీ ఎంపీటీసీ సుజాత కుటుంబసభ్యులను ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పరామర్శించి ఆమె భర్త అనంత్‌రావు, కుటుంబ సభ్యులు డాక్టర్ సుప్రియ, సౌమ్యలను ఓదార్చారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ఢిల్లీ వసంత్, బస్వరాజ్ పాటిల్, రాయికోడ్ జడ్పీటీసీ మల్లికార్జున్ పాటిల్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్న పాటిల్, రాయికోడ్ ఆత్మ చైర్మన్ విఠల్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మారుతి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు మొగులయ్య గౌతం ఉన్నారు.

అర్హులైన వారందరికీ ఇళ్లస్థలాలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



జిన్నారం: ఖాజీపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, త్వరలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించనున్న స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఇళ్లస్థలం ఉన్న వారికి గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షల ఆర్థికసాయం అందించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతేకాకుండా స్థలంలేని పేదలను గుర్తించి 75గజాల ఖాళీ స్థలాన్ని కేటాయించే ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను త్వరలోనే అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, నాయకులు నవీన్, రాజేశ్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు: మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ వడ్డెర కాలనీలో మంగళవారం నిర్వహించిన బోనాల పండుగకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి



కోహీర్: దరఖాస్తును స్వీకరిస్తున్న అధికారులు

జహీరాబాద్: రైతుబీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, ఏడీఏ భిక్షపతి సూచించారు. మంగళవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుబీమా దరఖాస్తులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ఏఈఓలు ప్రదీప్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోహీర్(జహీరాబాద్): మండలంలో 2962 మంది అర్హత కలిగిన రైతులు ఉండగా ఇప్పటివరకు 456 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని జహీరాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు భిక్షపతి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఏఈఓ రైతులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యుల ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): బ్రాహ్మణ సేవా సమాఖ్య మండల అధ్యక్ష, కార్యవర్గ సభ్యులతో పాటు మహిళా అధ్యక్ష కార్యవర్గ సభ్యులను మంగళవారం పట్టణంలోని సంగమేశ్వర మందిరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య మండల గౌరవ అధ్యక్షుడిగా మాడుగుల సర్వోత్తమ శర్మ, అధ్యక్షుడిగా కరణం నరసింహరావు, ప్రధాన కార్యదర్శిగా దేశ్‌పాండే నరేష్, కోశాధికారిగా పటావ్రి రాజేశ్వర్‌రావు, మహిళా మండల అధ్యక్షురాలిగా కరణం జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా జోషిరాధిక, కోశాధికారిగా శాంతి సుబ్బులక్ష్మిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు రాఘవచారి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వినోద్‌పాటిల్, అసోసియేట్ అధ్యక్షుడు రమేష్‌రావు, సంగారెడ్డి మండల అధ్యక్షుడు రవిశంకర్, పీఆర్ఓ పట్వారి శ్యామ్‌రావు బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ఎన్నికలు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కెప్టెన్, వైస్‌కెప్టెన్ ఎన్నికలు నిర్వహించారు. కెప్టెన్‌గా ఇంటర్ సెకండీయర్ చెందిన అఖిల్ 142 ఓట్లతో, వైస్ కెప్టెన్‌గా పదో తరగతికి చెందిన మధు 17ఓట్లతో గెలుపొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి ఎన్నికలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ గాయత్రి, సాంబ్యానాయక్, ఉపాధ్యాయులు, శ్రీనివాసులు బాలలక్ష్మి, జగన్, నరహరి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోహీర్(జహీరాబాద్): మండలంలో సోమవారం రాత్రి ప్రారంభమైన వర్షపు జల్లులు మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉన్నాయి. 20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వర్షం కారణం చేత మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరాతో పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, హిస్టరీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు, ఇంగ్లీష్, కామర్స్ సబ్జెక్టుల్లో రెండు చొప్పున పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పీజీలో కనీసం 55శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7673967514 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జహీరాబాద్: జహీరాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ తెలిపారు. కాలేజియేట్ ఎడ్యూకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరానికి గాను అర్హులైన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. తెలుగు, ఉర్దూ మీడియంలలో ఆయా పోస్టులు 10వరకు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు ఉండాలని సూచించారు.

సంక్షేమ పథకాలపై ప్రదర్శన



జ్ఞాపిక అందజేస్తున్న నాయకులు

హత్నూర (సంగారెడ్డి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై హత్నూర గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వీరస్వామిగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బీఆర్ఎస్ కళాజాత బృందం కళాకారులు మాట్లాడే బొమ్మలతో మిమిక్రీ మ్యూజిక్ షో ద్వారా సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సత్యవతి పెంటేష్, వార్డుసభ్యులు ఆసిఫ్, శ్రీకాంత్, ఖదీర్, నర్సింహులు, మిమిక్రీ ఆర్టిస్ట్ సుధాకర్‌స్వామి, మ్యూజిక్ అసిస్టెంట్ చిన్నయ్య, సభ్యులు పండరి మాజీ సర్పంచ్ ఆకుల కిష్టయ్య పాల్గొన్నారు.



విరబూసిన బ్రహ్మ కమలం

సాక్షి, సంగారెడ్డి: సంగారెడ్డిలో అరుదైన పుష్పం విరబూసింది. ఏడాదికి ఒకసారి మాత్రమే వికసించే బ్రహ్మ కమలానికి స్థానికులు పూజలు చేశారు. సంగారెడ్డి పట్టణంలోని తెలంగాణ టౌన్ షిప్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కల్వల లతాశ్రీ తమ ఇంటిలో సుమారు మూడేళ్ల క్రితం బ్రహ్మకమలం నాటింది. ప్రస్తుతం ఒకే మారు పూలు పూయడం ఆనందం ఉందన్నారు. తాజాగా రాత్రి 9 గంటల సమయంలో బ్రహ్మకమలం విరబూసిందని ఆమె చెప్పారు. ఈ బ్రహ్మ కమలానికి హిందూ సంప్రదాయంలో దీనికి చాలా విశిష్టత ఉంది. ఈ పుష్పం జనావాసాల్లో చాలా తక్కువగా కనిపిస్తుంది. కొన్ని గంటలు మాత్రమే వికసించే ఈ అందమైన పుష్పాన్ని చూసేందుకు జనం ఆసక్తి చూపుతారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



నాట్యకళ ప్రదర్శనకు హాజరైన విద్యార్థినులు

సదాశివపేట(సంగారెడ్డి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి సన్నిధిలో జాతీయస్థాయి నాట్య కళాప్రదర్శన పోటీలను మంగళవారం రాత్రి నిర్వహించారు. సదాశివపేట పట్టణానికి చెందిన ఆత్మకూర్ నాగేష్ కుమార్తె శ్రీఅక్షయ కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. నాట్య కళా ప్రదర్శనలో 300 మంది విద్యార్థినులు నాట్యాన్ని ప్రదర్శించారు. ఉత్తమ నాట్య కళా ప్రదర్శన చేసినందుకు గాను తన కూతురు అక్షయ బహుమతి సాధించినట్టు బీఆర్ఎస్ నాయకుడు నాగేష్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

పుల్‌కల్(అందోల్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహా కూతురు త్రిష అన్నారు. పల్లె పల్లెకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని రాయిపాడ్ గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు దుర్గారెడ్డి, నాయకులు లకోష్మీరెడ్డి, రవిందర్, అహ్మద్, మాణిక్యం పాల్గొన్నారు.

◆ ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలి

కంది(సంగారెడ్డి): హరితహారంలో భాగంగా ప్రతి గ్రామంలో 8వేల చొప్పున మొక్కలు నాటాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చేర్యాల్, కాశిపూర్ గ్రామాల్లోని వన నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ షేరఖాన్‌పల్లిని జిన్నారం మండలంలో విలీనం చేయాలి

హత్నూర (సంగారెడ్డి): మండలంలోని షేరఖాన్‌పల్లి గ్రామ పంచాయతీని జిన్నారం మండలంలో విలీనం చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ యువ నాయకులు శివరామకృష్ణ, వార్డుమెంబర్లు శివరాజ్, లింగంగౌడ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

హత్నూర (సంగారెడ్డి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం 6వ సంవత్సరానికి సంబంధించిన పాలసీకి దరఖాస్తులకు అవకాశం కల్పించడంతో మండల పరిధిలోని చందాపూర్, కొనంపేట్ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు రైతుబీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతుబీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో ఈ నెల 31లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు, వ్యవసాయ విస్తరణ అధికారి వరప్రతాప్, రైతులు గొల్ల కృష్ణ, మానిక్‌రెడ్డి, దాసరి బాలకృష్ణ పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌పై నమ్మకం లేకనే బీఆర్ఎస్‌లో చేరికలు

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్ నాయకులు చెబుతున్న మాయమాటలపై నమ్మకం లేకనే ఆ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్ పథకాలను ప్రవేశపెట్టి రైతాంగానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు.

◆ కనులపండువగా బోనాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని కూరగాయల వ్యాపారుల ఆధ్వర్యంలో మంగళవారం అస్తబల్ తోటలో ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. కూరగాయ వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షుడు బంగారు కృష్ణ, అధ్యక్షుడు దుర్గయ్య, సభ్యులు నర్సింహులు, ఇంతియాజ్, జ్యోతి, అనిత, జగదాంబ, నర్సమ్మ, భాగ్యమ్మ, ఇందిరమ్మ, మల్లేశం, శ్రీను, సలాఉద్దీన్, యాదయ్య పాల్గొన్నారు.

◆ ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): ఈ నెల 20న హైదరాబాద్‌లోని టీఎస్ఐడీసీ కార్యాలయంలో నిర్వహించే తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాలని ఆ పార్టీ నాయకులు నర్సింహరెడ్డి, గౌసోద్దీన్, రఫీయోద్దీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు.

◆ వాటర్‌ఫిల్టర్ అందజేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని గురుదత్త ఆశ్రమంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి మంగళవారం వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. అనంతరం వాటర్‌ఫిల్టర్‌ను ఆశ్రమ నిర్వాహకులు దత్త విజయానంద స్వామిజీ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, నందారెడ్డి, పెంటారెడ్డి, భూపాల్‌రెడ్డి, కనకరాజు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని దాదిగూడ గ్రామానికి చెందిన నాగరాజు, నిఖిల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో వైద్యఖర్చుల నిమిత్తం చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన నగదును మంగళవారం ఎన్ఎంఆర్ యువసేన నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు.

◆ పరామర్శ

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలం ఈదుల్ తండా పంచాయతీ పరిధిలోని జయరాం తండాకు చెందిన రాములునాయక్ మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడైన బీఆర్ఎస్ నాయకులు రోషన్‌రెడ్డి తండాకు వెళ్లి రాములునాయక్ మృతదేహానికి నివాళులర్పించారు.

◆ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ పుష్పనగేష్ సూచించారు. మంగళవారం పట్టణంలోని కానుకుంటలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రోడ్లపై నీరు నిలువకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

◆ వర్షంలోనూ పారిశుద్ధ్య పనులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా మోస్తారుగా వర్షం కురిసింది. నారాయణఖేడ్ పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు పలు కాలనీల్లోని మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు తట్టుకోవడంతో మురుగునీరు కాలనీలు, అంతర్గత రహదారులపై ప్రవహించడంతో మున్సిపల్ కార్మికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. దీంతో కార్మికుల సేవలను స్థానికులు కొనియాడారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు.